# అమ్మనైలాలిస్తా

"మమ్మీ...మమ్మీ... నాక్కావాలీ ఈ...ఈ..." గుక్కపట్టి ఏడుస్తున్నాడు. గుండెలు పగిలేలా చిన్నా. నా చిట్టి తండ్రి.

"నాన్నా! అమ్మెటు పోయింది? చచ్చిపోయిందా?" తనువునంతా ఆర్ద్రతాభరితం చేసుకుని, గుండె గొంతుకతో ఆడుగుతోంది చిట్టి... నా గారాల కూతురు.

'ఉన్నోళ్ళు పోయినోళ్ళ తీపి గురుతులు.' అన్నాడో కవి.

నా 'భాగ్యం' పిల్లల్ని 'అభాగ్యుల్ని' చేసి తన తీపి గురుతుగా నాకు వదిలి వెళ్ళిందిగా! సమాధానం ఏం చెప్పను?

ఆత్మీయమైన ఓ అనుబంధం అందలేని చోటుకి వెళ్ళిందని, తరలిరాలేని తీరాలకి చేరిందని చెప్పనా? ఆచ్చి వెళ్ళింది! వస్తుందని చెప్పనా.

ధర్మేచ...

అర్థేచ...

కామేచ...

మోక్షేచ... నాతి చరామి!

అంటూ, అగ్నిసాక్షిగా ప్రమాణం చేసిన నేను... మనసా, వాచా, కర్మేణా... నా సహధర్మ చారిణి వెన్నంటే వున్నాను.

కానీ, విధి వక్రించిందో, నా తలరాత వెక్కిరించిందో, నా అర్ధాంగి అర్ధాంతరంగా నను వీడి 'ఒంటరి పయనమై' తన జీవితాన్ని పరిసమాప్తం చేసుకుంది.

ఆనందానుభూతుల్ని అణువణువూ ఆవిష్కరింపచేసి ఆద్యంతం అలరించిన ఓ అనురాగబంధం, చాలు చాలిక ఈ భవబంధాలంటూ, ఒంటరి నావను దుఃఖ సాగరంలోకి నెట్టేసి, తను మాత్రం అదృశ్యమైపోయింది.

కార్యేషు దాసి...

కరణేషు మంత్రి...

భోజ్యేషు మాత...

శయనేషు రంభ...

అనే మాటల్ని ధర్మపత్నినై ఆచరించింది. కానీ చివరిగా 'క్షమయా ధరిత్రి' కాలేక పోయింది. నా కోసం నూరేళ్ళూ ఆగలేకపోయింది.

మూడు ముళ్ళ బంధాన్ని మూణ్ణాళ్ళ ముచ్చట చేసి, ఏడడుగుల అనుబంధం ఏడు క్షణాల పరిమళమని భ్రమింపజేసి, హడావుడిగా వెళ్ళిపోయింది.

మనసున మంగళకరనాదమై నినదించి, అంతలోనే గుప్పెడు గుండెకు కొండంత వేదనందించి కనుకొనల్లో అశ్రుకణమై తారట్లాడ్తోంది.

పిల్లలేమో తల్లికోసం విలపిస్తున్నారు. వలవలా ఏడ్చేస్తున్నారు.

కల్లా కపటం, జననం, మరణం, ఇవేవీ తెలీని ఈ లేత హృదయాల్ని ఎలా ఓదార్చను? పసిమనసుల్ని ఏమని ఊరడించను?

అన్నం తిననని మారాంచేస్తూ-

'అదిగో చందమామ కావాలి' అని పిల్లలు అల్లరి చేస్తే "తెచ్చిస్తాలే!" అంటూ బుజ్జగిస్తూ 'ముందో ముద్ద తినమని' గోరుముద్దలు తినిపిస్తుందా కమ్మనైన అమ్మ.

'ఆ అమ్మే కావాలి' అని ఏడిస్తే, నేనేలా తీసుకురాను.

మమకారాన్ని మనసు లోతుల్లోకి వొంపేసి... అనురాగాల్ని అందరి ఎదలకి శృతిచేసి... ఎందుకు, ఎందుకని... మా మధ్యనుండి విషాదపు వీచికవై కదలిపోయావ్? ఆకాశ సిగలో 'అరుంధతి'వై మెరిసి...అందర్నీ అలరిద్దామనా!... 'జాబిల్లి' వై చిన్నారుల్ని మురిపిద్దామనా!!

ఓ కన్నీటి శకలం- గుండె లోతుల్లోకి జారిపడింది...!

"మమ్మీ...! మమ్మీ...!! అంటూ చిన్నా, చిట్టి ఏడుస్తూనే వున్నారు.

'ఆర్తిగీత' మీవేళ ఆలపించగలనేమో కానీ-

అమ్మపాడే కమ్మని 'జోలపాట' పాడి వాళ్లనెలా నిదురపుచ్చను...?

నేను సైతం అమ్మ వరం ఈ జన్మకు పొందని నిర్భాగ్యుణ్ణి... మీకు అమ్మను నేనెలా తేగలను...? ఏడేడు లోకాల నేనేడ వెతకను?

జవాబు చెప్పలేక... పెదవి విప్పలేక...

ఆ రెండు పసిగువ్వల్ని నా గుండెలకి హత్తుకొని మౌనంగా ఏడ్చేసాను.

★ ★ ★

నాకు-

'అమ్మ'ంటే

ఆప్యాయత నందించే అమృతమూర్తి అని తెలీదు...!

మారాం చేసేవేళ ముద్దులతో ముంచెత్తే వెన్నెల ముద్దనీ తెలీదు...!!

అమ్మ అనురాగపు తీయని జోలపాట లాలనను నేనెరుగను.

పుడుతూనే కన్నతల్లిని పొట్టన పెట్టుకున్నానట. అందుకే అమ్మ పొత్తిళ్ళలో చేరి కేరింతలు కొట్టలేదు. ఆయా చేతిలో 'బొమ్మ'లా పెరిగాను.

'అమ్మా...!' అంటూ అప్యాయతతో పిలిచిమైమరచి పోవాల్సింది పోయి... 'ఆయా!' అని అనేందుకు నాన్న ఆయాని నియమించాడు. ఆయా ఎప్పటికీ అమ్మ కాలేదుగా! నాన్న మళ్ళీ పెళ్ళిచేసుకున్నాడు. నాకు మరో అమ్మని తేవాలని.

ఆ వచ్చిన అమ్మ 'కన్నతల్లి' కాలేకపోయినా 'కమ్మని అమ్మైనా' అవుతుందేమోనని ఆశపడ్డాను.

కన్నపేగు కాదుగా !

పేగుబంధమై ప్రేమానురాగాల్నెలా పల్లవిస్తుంది.

మమతల వెల్లువై మాతృ వాత్సల్యాన్నెలా కురిపిస్తుంది.

'సవతి తల్లి' ఎప్పటికి 'కన్నతల్లి' అవలేదుగా. నా చిన్నిగుండె అమ్మకోసం విలపించేది. ఆ చల్లని తల్లి స్పర్శ కోసం ఎద తపించేది. మనసు మాతృమూర్తి మమకారం కోసం మారాం చేసేది.

ఎందుకమ్మా??

నన్ను కని, కన్నప్రేమను రుచి చూపించకుండానే కడతేరిపోయావు. నన్ను... నన్నెందుకు... అమ్మతోడులేని అనాథని చెసావ్?

కన్నబిడ్డపై కరుణనెలా మరిచావ్? నేనేమై పోవాలని!

నీ చల్లని స్పర్శ నావెచ్చని గుండెని తడమనే లేదే! నీ వెచ్చని ఊపిరి నాకు చల్లని వెన్నెల వెలుగవ్వనే లేదే?

అమ్మ గుర్తుకొస్తే చాలు. గొంతు మూగబోయేది! కళ్ళు బరువయ్యేవి!! గుండె చెరువయ్యేది!!!

నా తడి కళ్ళలోని తపనే పసిగట్టేదో... ఆమెలోని అమ్మ మనసే నను గుర్తించేదో... నా అర్ధాంగి నను చేరి ప్రేమగా ముంగురులు సవరించి అప్యాయంగా దగ్గరకు హత్తుకునేది.

ఆమె సాంగత్యం అమ్మ ఒడిని తలపించేసేది. పసిపిల్లాడినైపోయే వాడినా క్షణంలో. భర్తనని మరచి పసిబిడ్డను చేసి లాలించేది.

అట్లాంటి-

నా ఇంటి దీపం...

నా ప్రేమధూపం...

నను వీడి మరోమారు అమ్మలేని అనాథను చేసింది. నా అనురాగ దేవత ఎడబాటు... ఎడపోటై... నన్ను మానసికంగా మరింత కుంగదీస్తోంది.

ఈరోజు... దశదిన కర్మ...!

నాతో ఏడడుగులు నడిచినందుకు అలిసో...

ఇక ఏడేడు జన్మల తోడవ్వలేనేమోనని అలకో...

నా జీవిత భాగస్వామి నన్ను శోకతప్తున్ని చేసి, అమరలోకాలకి తరలి వెళ్ళిన పదవరోజిది.

ఆమె ఆత్మశాంతికై ఏర్పాట్లు మొదలయ్యాయి.

నా ప్రమేయం లేకుండానే హితులు, సన్నిహితులు, స్నేహితులు...నా అనేవారంతా తోచిన విధంగా సాయం చేస్తూనే వున్నారు.

ఇంతలో వినిపించిందొక ఆర్ద్రతాభరితమైన గొంతు... ఆర్తిగీతంలా నా గుండె కవాటాల్ని తెరుస్తూ.

"మే...మే... అనరుస్తూ లేలేత కాళ్ళతో గెంతులు... కరుణ రసాత్మకంగా పడుతూ లేస్తూ... తల్లిమేక వెంట పరుగెత్తుతోంది పిల్లమేక. దాని వంక జాలిగా చూశాను. అది మే... మే... అనరుస్తున్నట్లనిపించలేదు నాకు.

"అమ్మా...అమ్మా...!" అంటూ దీనాతి దీనంగా మా చిన్నోడు గొంతెత్తి ఏడుస్తున్నట్లుగా విన్పించి... గుండె మెలి తిరిగింది.

అమ్మ ఎవరికైనా అమ్మే కదా!

"మేకపిల్ల అదే పనిగా అరుస్తోంది. ఎందుకో చూడు." పనివాడు సుబ్బణ్ణి కేకేసి పిల్చి చెప్పాను.

"దాన్తల్లి మేకను కోతకి తీస్కెళ్ళి పోతున్నారయ్యా! అది తల్లెంట పడ్తోంది." విషయం తెలుసేమో, ఆరా తీయకుండా వినయంగా చెప్పాడు.

దశదినకర్మ నాటి భోజనానికి నాన్‌వెజ్ వండడం ఇక్కడి పద్ధతి.

"ఆ తల్లి మేకను వదిలి పెట్టమని నేను చెప్పానని చెప్పి... దాన్ని పిల్లమేక దగ్గర వదిలేయండి." అరచినంత పన్జేశాను.

ఏమనుకున్నాడో ఏమో చెప్పడమాలస్యం పరుగెత్తాడు సుబ్బన్న.

కాసేపట్లో పాలకొరకై తల్లి పొదుగు కుమ్ముతూ... తల్లివెంట పరుగులు తీస్తూ... ఆనందంగా వస్తోన్న పిల్లమేక కన్పించింది. తృప్తిగా ఫీలయ్యాను.

నా ఆలోచనల్ని చెరిపేస్తూ-

"బాబూ... ఈక్షణంలో చెప్పకూడదనుకో! కానీ ఎప్పుడో ఒక్కప్పుడు నీ చెవిన వేయక తప్పదుగా? నా కూతురు జ్ఞాపకాల తడి ఆరకముందే మరో ఆడకూతుర్ని కట్టుకో! నీకేం వయసు పోలేదు. నీ కోసం కాకపోయినా ఆ చిన్నారుల కోసం, వాళ్ళకో 'అమ్మ' నివ్వడం కోసం..." చెప్తున్నాడు మామయ్య సమస్యల పర్యవసనాలని ఔపోసన పట్టిన వ్యక్తిలా.

సముద్ర ఘోష హృది గదిలో ప్రతిధ్వనించినట్లు... భూకంపనాలు మనసు పొరల్లో అలజడి రేపినట్లు... ఆ ప్రతిపాదన వినగానే తుళ్ళిపడ్డాను.

"నో! మళ్ళీ పెళ్ళి చేసుకొని నా పిల్లల గొంతు కోయలేను. మరోసారి ఈ ప్రస్తావన నా దగ్గర తేకండి." అంటూ అరిచాడు.

అది వరకు నా సమాధానం కొరకు ఎదురుచూస్తున్న మామయ్య నిశ్శబ్దంగా వెళ్ళిపోయా డక్కడినుండి.

పిల్లల వంక జాలిగా చూసాను. పిల్లమేకకి తల్లినందివ్వగలిగాను. మరి నా పిల్లలకో...?

నా కనుపాపల ఉపరితలాల మీద రివ్వున ఓ తడిపరదా రెపరెపలాడింది.

ఆకాశంలో మెరిసే హరివిల్లుని చూచి మురిసే నక్షత్రాలూ, వెలసిన వర్ణమాలని చూడలేక వెక్కి వెక్కి ఏడ్చినట్టు-

విరబూసి, తావిని వెన్నెల నురగలా వెదజల్లాలని ఉవ్విళ్ళూరే విరిసీ విరియని మొగ్గలు తల్లివేరు తెగిన వేళ, వాడి తల్లడిల్లినట్టు-

తల్లి రెక్కల రక్షణ లేని పక్షులకి మల్లే ఆ పసివాళ్ళు "అమ్మా..." అంటూ గోడు గోడున విలపిస్తున్నారు.

నాకు తిరిగి అమ్మ గుర్తుకు వచ్చింది. వేదన కన్నీరై ఒలికింది. గుండెలో తడి సుడులు తిరిగింది.

మమకారం మనసు పొరల్ని ప్రేమగా స్పృశిస్తుంటే... అమ్మ ప్రేమానురాగాల్ని పొందని నేను- అమ్మ అభిమానాన్నిక పొందలేమోనని ఆ పసికూనలు- తల్లి ప్రేమామృతానికై...ఆర్తిగా అలమటిస్తున్నారు!!

ఆ క్షణంలో...

నా అంతరంగ క్షేత్రంలో ఓ స్థిరనిర్ణయం వెల్లూనుకుంది.

అదేమంటే-

మా నాన్న చేసిన పొరపాటు మళ్ళీ నేను నా పిల్లల విషయంలో పునరావృతం కానివ్వకూడదని! నా పిల్లలకి సవతి తల్లి పోరుని తెచ్చిపెట్టకూడదని!!

అమ్మలేని లోటు పూర్చలేనేమో గానీ అమ్మ వాత్సల్యానురాగాల్ని భర్తీ చేద్దామనే తలంపు నాలో వూపిరి పోసుకుంది.

కంటికి రెప్పనై, నా కను "పాపల్ని" లాలిద్దామని... నా ఆశల దీపాల్ని ఆర్తిగా గుండెలకి హత్తుకున్నాను.

నాక్కావాల్సింది నా సుఖం కాదు. పిల్లల బంగారు భవిష్యత్.

అందుకని, ఇకనుండి 'తండ్రి' పాత్రతో పాటు, 'తల్లిపాత్ర' నీ ధరించి జోలపాటలతో వాళ్ళని జోకొడతా!

'నాన్న'ను నేనైనా, అన్నిటా 'అమ్మ'నై చిన్నారుల్ని లాలిస్తా!